క్లుప్తంగా

ఉద్యాన పంటల పరిశీలన



పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానది వరద ముంపునకు గురైన ఉద్యాన పంటలను అధికారులు బుధవారం పరిశీలించారు. పెదపులిపాక, యనమలకుదురు గ్రామాలో ముంపునకు గురైన పంటలను ఉద్యాన, పట్టుపరిశ్రమల డైరెక్టర్ కె. శ్రీనివాసులు వచ్చి చూశారు. స్థానిక రైతులతో మాట్లాడారు. వరద కారణంగా పంటలు ముంపునకు గురయ్యాయని, అరటి, కంద, పసుపు, కూరగాయాలు, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆయనకు వివరించారు. పంటల నష్టం వివరాలు నమోదు చేయాలని డైరెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జిల్లా ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కానూరు వాసులు



లక్ష్మీపురం(గుంటూరు): వరద ముంపు ప్రాంతాలైన సింగ్ నగర్ లూనా సెంటర్ అంతర్గత వీధుల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయక చర్యలూ లేకపోవడంతో గత మూడు రోజుల నుంచి అనేకమంది బాధితులు భోజనం వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కానూరు డీఎస్ఆర్ రంగా బొమ్మ సెంటర్ ప్రాంతానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి స్థానికులతో కలిసి వారందరూ తలాకొంత నగదు వేసుకొని రెండు రోజులుగా ఈ ప్రాంతంలో అన్నదానం చేస్తున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



అంబాపురం(విజయవాడరూరల్): గడచిన ఐదు రోజులుగా వరద ముంపులోనే ఉన్నాం.. ఆదుకోవాలని బాధితులు జిల్లా పంచాయతీ అధికారి డి.శివప్రసాద్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. అంబాపురం గ్రామంలో వరద ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బాధితులు వరద నీటిలో ఇళ్లన్నీ మునిగిపోయినా ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని వాపోయారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలోని వలంటీర్లను రప్పించి వారితో ప్రభుత్వం పంపిన పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి ఎంపీడీఓ బి.భార్గవి, ఈఓఆర్డీ ఎంపీడీ ప్రసాద్ వచ్చి పరిశీలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తన భర్త కనబడటం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు డొంక రోడ్డులో ఉంటున్న నండూరి ఈశ్వరరావు వాచ్‌మెన్‌గా పని చేస్తాడు. అతను ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని భార్య నండూరి అమ్మాజీ, ఇద్దరు కుమారులు విజయవాడ పరిసర ప్రాంతాలు, పెనమలూరు మండలం, గన్నవరం ప్రాంతాల్లో వెతికారు. అయితే ఈశ్వరరావు ఆచూకీ తెలియలేదు. దీంతో అతని భార్య అమ్మాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక 16వ నంబరు జాతీయ రహదారిపై బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. విజయవాడ నుంచి హనుమాన్‌జంక్షన్ వైపునకు వస్తున్న జీపును డివైడర్ అవతలి వైపున ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జనసేన పార్టీ నేత గరికపాటి శివశంకర్‌తో పాటుగా జీపులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు యువకులు గాయాలపాలైయ్యారు. ఈ ఘటనపై వీరవల్లి పోలీసులు విచారణ చేపట్టారు.

వివాహిత దుర్మరణం

రామవరప్పాడు: రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందిన ఘటన విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన జె. వెంకటరమణ, చంద్రవతి భార్యభర్తలు. వెంకటరమణ సోదరి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. దీంతో వెంకటరమణ తన భార్య చంద్రవతితో కలిసి ద్విచక్రవాహనంపై సోదరిని పరామర్శించేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ప్రసాదంపాడు ఉప్పెర బజారు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ గాయాలతో బయటపడగా, చంద్రవతి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వెంకటరమణ ఫిర్యాదుతో పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీడని ముంపు

- వరద నీటిలోనే నివాసాలు
- దెబ్బతిన్న పంట పొలాలు
- సహాయక చర్యలు అంతంత మాత్రమే

అంబాపురం(విజయవాడరూరల్): గత ఐదు రోజులుగా అంబాపురం గ్రామం బుడమేరు వరదలోనే ఉంది. అక్కడి ప్రజలు బయటకు రాలేక ఇంట్లో ఉండలేక అల్లాడుతున్నారు. ప్రభుత్వం వరద బాధితుల కోసం అనేక సహాయ చర్యలు చేపట్టామని చెబుతున్నా అధికారులు ఎవ్వరూ రాలేదని బాధితులు వాపోతున్నారు. చిన్నపిల్లలకు పాలు లేవని, వృద్ధులతో అనేక ఇబ్బందులు పడుతున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదంటున్నారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లేందుకు కనీసం పడవలు కూడా ఏర్పాటు చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, తినడానికి తిండి లేక అల్లాడుతున్నామని, ప్రభుత్వం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బాధితులు వేడుకుంటున్నారు.

రామవరప్పాడు: వరద బీభత్సంతో విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, నిడమానూరు, గూడవల్లిలోని పలు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. రామవరప్పాడు ఫ్లైఓవర్ దిగువ ప్రాంతంలోని రాఘవేంద్రకాలనీలో అపార్టుమెంట్లు, ఫ్లైఓవర్ కింద ఎస్ఎల్‌వీ గ్రీన్ విల్లాల్లో చేరిన వరద నీరు పూర్తిగా తగ్గకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫ్లైఓవర్ కింద అపార్టుమెంట్ల వద్ద ట్రాక్టర్లు, పడవలతో వరద బాధితులను బయటకు తీసుకొస్తున్నారు. కాల్వగట్టు ప్రాంతాలైన హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లోని అంతర్గత రహదారులు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. బుడమేరు కాలువకు గండి పడటంతో నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. నిడమానూరు పెట్రోల్ బంక్ నుంచి గ్రామం వెలుపలికి వెళ్లే రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. జాతీయ రహదారి వెంబడి ఉన్న మోడల్ డెయిరీతో పాటు హైవేపై వరద నీరు చేరుకుంది.



వరద ముంపులో అంబాపురం

గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కల, సావరగూడెం గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. జక్కులనెక్కలం గ్రామానికి గూడవల్లి నుంచి పడవలపై సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. సావరగూడెం గ్రామస్తులు నిత్యావసర సరుకుల కోసం ముస్తాబాదకు కాలినడకన వెళుతున్నారు. ఈ మార్గంలో వరద ఉధృతి రహదారిపై కొనసాగుతోంది. కేసరపల్లి నుంచి సావరగూడెంకు, ముస్తాబాద నుంచి సూరంపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. పంట భూములపై ఇప్పటికీ అడుగుల మేర వరద ఉధృతి కొనసాగుతోంది. ముస్తాబాద, సావరగూడెం, జక్కులనెక్కలం, పురుషోత్తపట్నం గ్రామాల ఆయకట్టు పూర్తిగా నీట మునిగింది. వేలాది ఎకరాలు ముంపులోనే ఉన్నాయి.

గన్నవరం: మండలంలోని పలు గ్రామాలు వరద ముంపు నుంచి బయటపడుతున్నాయి. కేసరపల్లి-సావరగూడెం రోడ్డులో వరద ప్రవాహం తగ్గుతుండటంతో సాధరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కేసరపల్లి శివారు అప్పారావుపేట ఏలూరు కాలువకు పడిన గండి ద్వారా వరదనీరు పంట పొలాలను ముంచెత్తింది. గండి పూడ్చేందుకు ఇంత వరకు ఇరిగేషన్ శాఖ అధికారులు ముందుకురాలేదు. వాగులు పొంగుతుండటంతో బుద్దవరం శివారు దాసులపాక వద్ద కాలనీ, బూతిమిల్లిపాడు పరిధిలోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని పెద్ద చెరువులోకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో ఏ క్షణానికి ఏమి జరుగుతుందోనని ఆందోళనతో గ్రామస్తులు ఉన్నారు. పంచాయతీ, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు కలిసి ఇసుక, మట్టి కట్టలతో చెరువుకు పలుచోట్ల గండి పడకుండా అడ్డుకట్టలు వేశారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఉంగుటూరు: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో మండలంలోని బుడమేరు, వన్నేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత నాలుగు రోజుల నుంచి బుడమేరు ఉధృతి పెరుగుతూ బుధవారం ఎక్కువ కావడంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలోకి వెళ్లాయి. పంట పొలాలు పూర్తిగా జలమయమయ్యాయి. తేలప్రోలు-నందమూరు, గన్నవరం-పుట్టగుంట ప్రధాన రహదారుల్లో రోడ్డు పైనుంచి ఐదు అడుగుల ఎత్తున వరద ప్రవాహం కొనసాగడంతో రాకపోకలు స్తంభించాయి.



సావరగూడెం నుంచి వరద నీటిలో ముస్తాబాదకు నిత్యావసరాల కోసం వెళుతున్న మహిళలు



వరద నీటితో నిండుకున్న వీరవల్లి పెద్ద చెరువు



గన్నవరం-పుట్టగుంట ప్రధాన రహదారిలో ఆముదాలపల్లి వద్ద బుడమేరు ప్రవాహం



రామవరప్పాడు ఫ్లైఓవర్ కింద రాఘవేంద్ర కాలనీలో వదరనీరు



వరదనీటిలో గూడవల్లి అంతర్గత రహదారి



బూతుమిల్లిపాడు వద్ద జలమయమైన వరి పొలాలు

వరద బాధితులకు ఆపన్న హస్తం

పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానది వరదకు కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు దాతలే దేవుళ్లుగా కనబడుతున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని ఎదురుచూసిన బాధితులకు నిరాశ మిగలగా దాతలు ముందుకు వచ్చి మేమున్నామని ఆపన్న హస్తం అందించారు. మండల పరిధిలో వరదల కారణంగా యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతాల్లో ఉంటున్న ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి. ప్రభుత్వం బాధితులు తలదాచుకోవడానికి ఏర్పాట్లు, ఆహారం, తాగునీరు, నిత్యావసర సరుకులు సరఫరా చేయలేదు. కేవలం దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బాధితులను ఆదుకున్నారు. తాడిగడప గ్రీన్‌సిటీ డెవలప్‌మెంట్ కాలనీ వాసులు బుధవారం వరద బాధితులకు ఆహారం అందజేశారు. రాయల్‌క్లబ్ విజయవాడ, పెదపులిపాక శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయం భక్తులు, హెల్త్ కేర్ సంస్థ, సీపీఎం పార్టీ వలంటీర్లు ఇలా అనేక మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వరద బాధితులకు ఆహారం అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కృష్ణానది వరద బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసర సరుకులను పెదపులిపాకలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె, దుప్పట్లు తదితర సరుకులు పంపిణీ చేశారు. ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, మేకా స్వాతి పలువురు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులో వరద బాధితులకు బుధవారం నగరానికి చెందిన గాయత్రి డెవలపర్స్ 99 సంస్థ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు. బుడమేరు కాలువకు గండి పడటంతో నిడమానూరు గ్రామం ముంపునకు గురైంది. అంతర్గత రహదారులతో పాటు నివాసాల్లోకి నీరు చేరుకుంది. బాధితులు బయటకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు గాయత్రి డెవలపర్స్ సంస్థకు పరిస్థితి వివరించి ఆహారం పంపిణీ చేయాల్సిందిగా కోరారు. దీంతో సంస్థ ప్రతినిధులు వరద బాధితులకు ఆహారం పంపిణీ చేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద రైల్వే కాలనీ వరద బాధితులకు స్థానిక నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమాం, సోదరుడు ఉమర్ మహ్మద్ అలీ, షేక్ ఈసా రుహుల్లా 250 భోజనం ప్యాకెట్లు అందజేశారు. సింగ్‌నగర్ ముంపు ప్రాంతంలో బాధితులకు భోజనం, వాటర్ బాటిళ్లు అందజేసినట్లు వారు తెలిపారు.



పెదపులిపాకలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



తాడిగడప గ్రీన్‌సిటీ కాలనీ వాసులు వరద బాధితులకు పంపుతున్న ఆహారం, నిత్యావసర సరుకులు



వరద బాధితులకు ఆహారం అందిస్తున్న సర్పంచ్ రంగారావు, గాయత్రి సంస్థ ప్రతినిధులు



ముస్తాబాద రైల్వే కాలనీలో భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న షేక్ ఇమాం, సోదరులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బుడమేరు ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గన్నవరం: బుడమేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్న దృష్ట్యా పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు సూచించారు. మండలంలోని కేసరపల్లి వద్ద బుడమేరు కాలువ వరద ఉధృతిని బుధవారం కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కాలువ ప్రవాహాన్ని, ముంపునకు గురైన పంట పొలాలను బుడమేరు వంతెనపై నుంచి వారు పర్యవేక్షించారు. ఇప్పటి వరకు మండల పరిధిలో ముంపునకు గురైన గ్రామాలు, పంట పొలాల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాలువ గట్టు ప్రాంతంలో కోతకు గురవుతున్న రోడ్డు ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గూడవల్లి-జక్కులనెక్కలం గ్రామాల మధ్య బుడమేరు ముంపు పరిస్థితులను పరిశీలించారు. ముంపు బారిన పడిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ గ్రామాల మధ్య ఉన్న వంతెన కూలిపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారి రాకపోకలు నిలిచిపోతున్నాయని వివరించారు. ఇప్పటికైన ప్రభుత్వం బుడమేరు కాలువపై వంతెన నిర్మించాలని కోరారు. పర్యటనలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కేసరపల్లి వద్ద బుడమేరు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

ప్రభుత్వ సాయమేదీ.?

పెనమలూరు: కృష్ణానది వరద ఒక్కసారిగా విరుచుకుపడటంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. మండలంలోని యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల పరిధిలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో అనేక భవనాలు, ఇళ్లు నిర్మాణం జరిగాయి. దాదాపు 20 వేల మందికి పైగా నివాసం ఉంటున్నారు. కృష్ణానదిలో వరద దాదాపు 13 లక్షల క్యూసెక్కులు రావడంతో కరకట్టకు వరద నీరు తన్నిపెట్టింది. వరద నీరు భవనాల మొదటి అంతస్తు వరకు చేరుకున్నాయి. ఇళ్లలో ఉన్న ఫర్నిచర్, విలువైన సామాగ్రి, వస్తువులు పూర్తిగా వరద నీటిలో కొట్టుకుపోయాయి. కనీసం గ్యాస్ బండలు కూడా మిగలలేదు. విద్యార్థులు, నివాసితులు వారి సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు కూడా వెంట తీసుకు రాలేకపోయారు.

రైతాంగానికి తీరని నష్టం

బాధితులకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు నిత్యావసర సరుకులు తప్పా ఎటువంటి సాయం అందలేదు. ప్రభుత్వం కూడా ఆస్తి నష్టానికి సంబంధించి సాయంపై ప్రకటన చేయకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. వరద కారణంగా గృహాలు దెబ్బతిన్నాయి. ఇళ్ల మరమ్మతులకు చాలా ఖర్చు అవుతుంది. అలాగే పంటల విషయానికి వస్తే పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. పంటల నష్టం అంచనా లెక్క కట్టలేనంతగా ఉంది. రైతులు కూడా ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.



పెదపులిపాకలో వరద తగ్గిన తర్వాత శ్రీనగర్‌కాలనీ రోడ్డు

వరదతో పూర్తిగా నష్టపోయాం




కృష్ణానది వరదతో పూర్తిగా నష్టపోయాం. కట్టుబట్టలతో మిగిలాం. తినడానికి తిండి కూడా లేదు. ఇళ్లు మునిగి కోలుకోలేని దెబ్బతిన్నాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

–సీహెచ్ నాగమణి, పెదపులిపాక

విద్యుదాఘాతంతో రైతు, గేదె మృతి

ఉంగుటూరు: విద్యుదాఘాతంతో రైతు, ఓ గేదె మృతి చెందిన సంఘటన తెంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం తెంపల్లిలో నాగన బోయిన శివాజీ(50) తన నివాసంలో నీటి మోటర్ వద్ద గేదె జారిపడటంతో విద్యుత్ ఘాతానికి గురైంది. గేదెను రక్షించే క్రమంలో అతను విద్యుత్‌ఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం శివాజిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్యా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఆత్కూరు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రైతు శివాజి(ఫైల్)



మృతి చెందిన గేదె

దాతల సాయం నేలపాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: విజయవాడలో వరద ముంపునకు గురైన నిర్వాసితులకు దాతలు సహృదయంతో అందిస్తున్న ఆహార పదార్థాలు అధికార యంత్రాంగం సమన్వయ లోపంతో వృధా అవుతున్నాయి. వేలాది ఆహార ప్యాకెట్లు హనుమాన్‌జంక్షన్, గన్నవరం సమీపంలో జాతీయ రహదారి పక్కన చెత్తకుప్పల్లో పారవేయడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. ఆపన్నుల ఆకలి తీర్చాల్సిన ఆహార పదార్థాలు కళ్ల ఎదుటే నిరుపయోగంగా రోడ్డుపై పారబోయడంపై పలు విమర్శలకు తావిస్తుంది. హనుమాన్‌జంక్షన్ శివారులో రామిలేరు వంతెన వద్ద జాతీయ రహదారి వెంబడి బుధవారం వేలాది ఆహార ప్యాకెట్లు లారీలో తీసుకువచ్చి పారేశారు.



జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఉంగుటూరు: భారీ వర్షాల వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని వెల్దిపాడు, ఎలుకపాడు, ఉంగుటూరు, ఆముదాలపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ క్రాప్ నమోదుతో సంబంధం లేకుండా రైతులకు పంట నష్ట పరిహారం అందజేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, కౌలు రైతు సంఘం నాయకులు టీవీ లక్ష్మణస్వామి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కంకిపాడు: బుడమేరు ముంపు బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. ఏపీ కౌలురైతు సంఘం, రైతుసంఘం సంయుక్త ఆధ్వర్యంలో కంకిపాడు, ఉంగుటూరు మండలాల్లోని బుడమేరు ముంపు ప్రాంతాల్లో బుధవారం నేతలు పర్యటించారు. పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో సమర్థంగా సర్వే చేసి నష్ట పరిహారాన్ని అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెలగపూడి ఆజాద్, పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ముంపునకు గురైన గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టినట్లు బాపులపాడు తహసీల్దార్ వి.నాగభూషణం బుధవారం తెలిపారు. మండలంలోని ఓగిరాల, రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం, కురిపిరాల, ఆరుగొలను గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరుకోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆరుగొలను, కానుమోలు జెడ్పీ హైస్కూళ్లలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఇళ్లు ముంపునకు గురైన నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.